సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
97053 47483
నంబర్‌ను సంప్రదించండి

శుద్ధి జలం @ ముడసర్లోవ

- తాగునీటి సరఫరాపై దృష్టి సారించిన అధికారులు
- మూడు దశల్లో వడిబోత అనంతరం సరఫరా
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆరిలోవ ప్రాంత వాసులు

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్ శుద్ధి జలం సరఫరాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఆరిలోవ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయడానికి జీవీఎంసీ అధికారులు కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతున్నారు. కొద్ది రోజుల క్రితం ఆరిలోవ ప్రాంతంలో నీటి శుద్ధిలో సమస్యలు తలెత్తుతుండేవి. దీంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నీటి శుద్ధికి అవసరమైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇటీవల ముడసర్లోవ పార్కులో ఉన్న నీటి శుద్ధి చేసే గ్యాలరీకి మరమ్మతులు చేశారు.


ముడసర్లోవ నీటి గ్యాలరీలో ఏర్పాటు చేసిన మూడు ప్యానళ్లు

ముడసర్లోవ రిజర్వాయర్ దిగువన పార్కులో బ్రిటిష్ కాలం నాటి నీటి శుద్ధి గ్యాలరీ ఉంది. రిజర్వాయర్‌లో నీరు దీంట్లోకి చేరుతుంది. ఈ గ్యాలరీనే నేటికీ జీవీఎంసీ అధికారులు వినియోగించి నీటిని శుద్ధి చేస్తున్నారు. కొన్నాళ్లుగా గ్యాలరీ అడుగు భాగంలో నాచు, మట్టి పేరుకుపోతోంది. దీంతో సరిగా వడకట్టని నీరే సరఫరా అవుతుండేది. దీంతో నలతలు, రంగు మారిన నీటితో ఆరిలోవ ప్రజలు ఇబ్బందిపడుతుండేవారు. నీటి సరఫరా అధికారులు ఇక్కడ సమస్యను గుర్తించారు. పక్కగా వడబోత అనంతరం నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టి సఫలమయ్యారు.

నీటి శుద్ధి ప్రక్రియ ఇలా..

నీటి సరఫరా విభాగం అధికారులు ఇటీవల ఇక్కడ గ్యాలరీని నీరు లేకుండా పూర్తిగా ఆరబెట్టారు. ఇందులో నాచు, మట్టి పొరలను సిబ్బందితో తొలగించారు. అనంతరం దాన్ని మూడు ప్యానళ్లుగా విభజించారు. ఈ మూడింటిలోను అడుగున గులకరాళ్లతో పాటు ఇసుక ఉంటుంది. రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిని గతంలో మాదిరిగా గ్యాలరీ అంతటినీ నింపేయకుండా ముందు రెండు పేనళ్లను నింపుతున్నారు. మిగిలిన ప్యానల్‌ను వారం పాటు ఆరబెడుతున్నారు. అందులో పేరుకుపోయిన నాచు, మట్టిని తొలగించి తర్వాత వినియోగిస్తున్నారు. ఇలా వారానికి ఒకదాన్ని ఆరబెట్టి ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు. గ్యాలరీ ప్యానళ్లలో చేరిన నీటిలో మలినాలు అడుగుకు చేరిన తర్వాత తేరిన నీటిని గ్యాలరీలో ఉన్న మూడు బావుల్లోకి పంపి వడబోత ప్రక్రియ చేపడుతున్నారు. ఆ నీరు గ్యాలరీ బయట ఉన్న మరో రెండు బావుల్లోకి చేరిన తర్వాత క్లోరినేషన్ చేసి పూర్తిగా శుద్ధి చేస్తున్నారు. అలా శుద్ధి చేసిన నీటిని ట్యాంక్‌లకు పంపి, తరువాత కుళాయిల ద్వారా ఇళ్లకు సరఫరా చేస్తున్నారు. దీంతో ఆరిలోవ ప్రాంతానికి పూర్తి స్థాయిలో శుద్ధి జలం సరఫరా అవుతోంది.

నాలుగు ట్యాంకుల ద్వారా సరఫరా

ముడసర్లోవ రిజర్వాయర్ పరిధి ఆరిలోవ ప్రాంతంలో నాలుగు చోట్ల నీటి ట్యాంక్‌లు ఉన్నాయి. బాలాజీనగర్ దరి బీసీ కాలనీలో 700 కిలో లీటర్ల ట్యాంక్, టీఐసీ పాయింట్ దరి ఎస్టీ కాలనీలో 600 కిలో లీటర్ల ట్యాంక్, ఆరిలోవ కాలనీలో 500 కిలో లీటర్ల ట్యాంక్, కొండవాలు పెదగదిలి దరి సింహగిరి కాలనీలో 500 కిలో లీటర్ల ట్యాంక్ ఏర్పాటు చేశారు. ఆయా ట్యాంక్‌లకు ఇక్కడ గ్యాలరీలో శుద్ధి చేసిన నీటిని సరఫరా అవుతోంది. ఇక్కడి నుంచి పరసర ప్రాంతాల్లోని కుళాయిలకు నీటిని సరఫరా చేస్తున్నారు. వీటితో పాటు అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా కూడా నీటి సరఫరా చేస్తున్నారు. వీటితో పాటు టీఎస్ఆర్ కాంప్లెక్స్ నుంచి డెయిరీ ఫారం, ఆదర్శనగర్, రవీంద్రనగర్, తోటగరువు, తదితర ప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతోంది.


గ్యాలరీలో ఉన్న నుయ్యి

శుద్ధి చేసిన నీటి సరఫరాకు కృషి



గ్యాలరీని గతంలో మాదిరిగా కాకుండా మూడు పేనళ్లుగా విభజించాం. వాటిలో వారానికి ఒకటి చొప్పున ఆరబెడుతున్నాం. అడుగున పేరుకుపోయిన నాచు, మట్టిని తొలగించిన అనంతరం రిజర్వాయరు నుంచి వచ్చిన నీటిని దానిలోకి చేరేటట్లు చేస్తున్నాం. దీనివల్ల ఎప్పటికప్పుడు గ్యాలరీలోనే నీటిలో ఉన్న మలినాలు తొలగిపోతాయి. గ్యాలరీ నుంచి బావుల్లోకి నీటిని మళ్లించి క్లోరినేషన్ చేసి మరింత శుద్ధి చేస్తున్నాం.
– అప్పాజీ, ఏఈ, ముసర్లోవ నీటి సరఫరా విభాగం, జీవీఎంసీ

ప్రకృతి వనం సందర్శన


ప్రకృతి వనంలో విద్యార్థులు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని జీవవైవిధ్య ఉద్యానవనాన్ని రాజాం శ్రీ జీసీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆదివారం సందర్శించారు. కళాశాలకు చెందిన 40 మంది విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా ఉద్యానవనాన్ని తిలకించారు. వైవిధ్యమైన మొక్కలు, వాటి ప్రత్యేకతను పార్కు నిర్వాహకుడు మంథా రామమూర్తి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎస్.హరిబాబు, ఎం.ఉమామహేశ్వరరావు, బి.రావు, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

మర్రిపాలెం: లారీని ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన ఘటన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లిపురం ప్రాంతానికి చెందిన గుజ్జు రామారావు కార్పెంటర్ పనులు చేస్తుంటారు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి రేసపువానిపాలెం వెళ్లాడు.
అక్కడి నుంచి ఓ స్నేహితుడిని కలవడానికి బైకుపై కంచరపాలెం వెళ్తుండగా కప్పరాడ జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ అతన్ని ఢీకొంది. దీంతో ఆయన కింద పడిపోగా, తలకి గాయాలవ్వడంతో ఆస్పత్రికి తరలించారు. రామారావు భార్య గుజ్జు మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

120 మందికి వైద్య పరీక్షలు


శిబిరంలో ప్రజలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్ ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఇందిరానగర్, డెయిరీఫారం, ఆదర్శనగర్ ప్రాంతాల నుంచి 120 మంది వృద్ధులు, మహిళలు వైద్య సేవలు పొందారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో రోగులకు ఈసీజీ, మధుమేహం, బీపీ, గైనిక్ క్యాన్సర్ తదితర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. దీంతో పాటు మెడికవర్‌లో 50 శాతం రాయితీ ఇచ్చే మెడికల్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం స్వామీజీ సౌమ్యానంద అవదూత, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన


అవగాహన సదస్సులో పాల్గొన్న వైద్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు రవీంద్రనగర్‌లో మాజీ కార్పొరేటర్ జగ్గుపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత ప్రారంభించారు. ముఖ్య అతిథులు ఎం.ద్వారకానాథ్, ఎం.నర్సింహపాత్రుడు, పి.రంగారావు, ఎస్.నరేంద్రనాథ్ ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. కీళ్ల నొప్పులతో పాటు గుండె, క్యాన్సర్ సంబంధిత సమస్యలు, ఆహారపు అలవాట్లపై సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏయూ విశ్రాంత ఆచార్యుడు ఎం.ఎస్.పాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

రూ.9.46 లక్షల నగదు, 4 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార : గురుద్వారా ప్రాంతంలో ద్వారకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ అప్పలరాజు, సిబ్బంది 4 కిలోల గంజాయి, రూ.9.46 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. గురుద్వారా వద్ద ఆదివారం బ్యాగులతో పెదబయలు మండలం జాముగూడ గ్రామానికి చెందిన కిల్లో మధుబాబు, కొర్రా భాస్కరరావు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి వద్ద నుంచి రూ.9.46 లక్షలు, 4 కిలోల గంజాయి, బైక్, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరికి సహకరించిన మరో ముగ్గురు కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితులిద్దరిపై కూడా గతంలో గంజాయి కేసులు ఉన్నాయి.

భక్తిశ్రద్ధలతో కార్తీక దామోదర ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో కార్తీక దామోదర మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథ స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం మంగళ హారతితో ప్రారంభమై గోపీగీత, భగవద్గీత 12వ అధ్యాయం, శిక్షాష్టకం పారాయణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

మర్యాద పూర్వక కలయిక


వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మొల్లి అప్పారావు

కొమ్మాది: వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా ఇటీవల నియమితులైన మొల్లి అప్పారావు ఆదివారం పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సహకారంతో తూర్పు నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమలో 15 మంది కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

మ్యాన్‌హోల్ లీకేజీ


ఇసుకతోట వివేకనంద కాలనీలో లీకవుతున్న మ్యాన్ హోల్

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట వివేకానంద వీధిలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. దీంతో కాలనీలో దుర్వాసన వస్తోంది. స్థానిక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. తక్షణ మ్యాన్ హోల్ లీకేజీని అరికట్టాలి.
– ఒమ్మి యర్రాజీ, ఇసుకతోట

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

సీతమ్మధార : నగరంలో అల్లర్లు సృష్టించే రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ద్వారకా ఏసీపీ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి హెచ్చరించారు. ఆదివారం ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు రాత్రి 9 గంటలకు ఇంటి వద్ద ఉండాలని, మద్యం సేవించి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరు పనుల్లో వారు ఉండాలని, ఎక్కడ పని చేస్తున్నారో సమాచారం ఇవ్వాలని సూచించారు. తగాదాల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిత్యం పోలీసు నిఘా ఉంటుందన్నారు. అనంతరం రౌడీషీటర్లను ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పజేప్పారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఐ ధర్మేంద్ర, అప్పలరాజు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.


పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా ఏసీపీ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి

ఫోర్తుటౌన్‌లో ..
ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు సీఐ ఎస్.విజయకుమార్ కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి తగాదాలు, కొట్లాల్లో తలదూర్చవద్దన్నారు. హత్య కేసులో ఉన్నవారు, అత్యాచారం కేసులో ఉన్న వారి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయండి

మద్దిలపాలెం : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రియను ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8వ తేదీన తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మధురెడ్డి పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మద్దిలపాలెం సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అదానికి కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతుందన్నారు. దీన్ని తిప్పికొట్టేందుకు అన్ని వర్గాల ప్రజల ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణకు దీక్షలు తలపెట్టి 8వ తేదీ నాటికి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా విద్యార్థుల సహాయంతో విద్యా సంస్థల బంద్ తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి అశోక్, ఈగల రమణ, కె.మధు, శ్రీను, సంతోష్ పాల్గొన్నారు.



విద్యా సంస్థల బంద్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఉక్కు కార్మికుల పోరాటానికి సంఘీభావం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆ సంస్థ కార్మికులు చేపట్టిన పోరాటానికి ఈనెల 8 నాటికి వెయ్యి రోజుల పూర్తవుతున్న సందర్భంగా గాజువాక కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నిర్వహించిన సమావేశంలో నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో నాయకులు గవర వెంకట రమణారావు, ఉరుకూటి అచ్చిబాబు, దొమ్మేటి రమణారావు, గుడివాడ శ్రీనివాసరావు, షేక్ అస్మత్ అలీ, దానబోయిన అప్పలనాయుడు, కోవిరి దేముడు, కొవిరి కోదండరావు, చట్టి సింహాచలం, పల్లేల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.
సోమవారం నుంచి 12వ తేదీ వరకు గుంటూరు–రాయగడ (17243)ఎక్స్‌ప్రెస్, మంగళవారం నుంచి 13వ తేదీ వరకు రాయగడ–గుంటూరు (17244)ఎక్స్‌ప్రెస్, మంగళవారం నుంచి 12వ తేదీ వరకు మచిలీపట్నం–విశాఖ (17219) ఎక్స్‌ప్రెస్,13వ తేదీ తేదీ వరకు విశాఖ–మచిలీపట్నం (17220)ఎక్స్‌ప్రెస్, 12వ తేదీ తేదీ వరకు విజయవాడ– విశాఖ– విజయవాడ (12718/12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 12వ తేదీ తేదీ వరకు కాకినాడ–విశాఖ– కాకినాడ (17267/17268) మెము స్పెషల్ రైళ్లు రద్దు చేశారు.

గమ్యం కుదించిన రైళ్లు
సోమ,మంగళవారాల్లో విశాఖలో బయల్దేరే విశాఖ–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరవలసిన కిరండూల్–విశాఖ (18513)ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8, 9తేదీల్లో కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. సోమ,మంగళవారాల్లో హౌరాలో బయల్దేరే హౌరా – జగదల్‌పూర్ (18005)సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన జగదల్‌పూర్ – హౌరా(18006) ఎక్స్‌ప్రెస్‌గా 7,8 తేదీలలో కోరాపుట్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.

నాందేడ్ –విశాఖపట్నం రీషెడ్యూల్
ఆదివారం నాందేడ్‌లో సాయంత్రం 4.30గంటలకు బయల్దేరవలసిన నాందేడ్–విశాఖ(20812) సూపర్‌ఫాస్ట్ స్పెషల్ పెయిరింగ్‌రైలు రాక ఆలస్యంగా రాత్రి 8.30గంటలకు బయల్దేరింది.

స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో భారీ చోరీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని క్వార్టర్స్‌లో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్ విభాగంలో సీనియర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. శ్రీనివాస్ టౌన్‌షిప్ సెక్టార్–1లోని 149–డీ క్వార్టర్‌లో కుటుంబంతో నివశిస్తున్నారు. యథావిధిగా శనివారం రాత్రి తలుపులు వేసిపడుకున్నారు. తెల్లవారి లేచి చూడగా ఇంటి హాల్లో వస్తువులు చిందర వందరగా పడిఉన్నాయి. ప్రధాన ద్వారం ముందు వైపు గడియ పెట్టి ఉంది. తనిఖీ చేయగా ఇంట్లో ఉండాల్సిన సుమారు 10 నుంచి 12 తులాల బంగారం వస్తువులు, 10 తులాల వెండి వస్తువులు, రెండు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ మాయమయ్యాయి. దీంతో వారు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమాచారం అందించారు. క్రైం ఎస్ఐ ఎల్. శ్రీనివాసరావు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. క్లూస్ టీంకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వేలిముద్రలు సేకరించారు. దొంగలు దిగువన ఉన్న పైపును పట్టుకుని పైఅంతస్తుకు వచ్చి వెనుక ద్వారం గుండాలోనికి ప్రవేశించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఉద్యోగి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.


ఇంట్లో చిందర వందరగా పడి ఉన్న వస్తువులు

ముగిసిన నిఘా వారోత్సవాలు


మాట్లాడుతున్న ఏయూ ప్రొఫెసర్ కృష్ణమోహన్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ పరిధిలో నిఘా వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. అవినీతికి అలవాటు పడితే జీవితాలు, కుటుంబాలు ఎలా నష్టపోతాయో ఏయూ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ వివరించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, డిబేట్, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ రైల్వే అధికారులు, సిబ్బందితో భేటీ అయ్యారు. అవినీతికి అలవాటు పడి జీవితాలు ఎలా నాశనం అయ్యాయో నుక్కడ్–నాటక్ వీధినాటికల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుడికి ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ప్రారంభించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అదిష్ఠింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి కుటుంబ సమేతంగా ఈ పూజలో పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం
శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అదిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణంగా నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ
శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై అదిష్ఠింపజేశారు. అష్టోత్త శతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

ఐక్యతతో సమాజంలో కాపులకు గుర్తింపు

అగనంపూడి: కాపులు ఐకమత్యంతో ఉంటే సమాజంలో ఉన్నత పదవులతోపాటు రాష్ట్రంలో తగిన గుర్తింపు ఉంటుందని కృష్ణదేవరాయ గాజువాక కాపు సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. అగనంపూడి బొర్రమాంబ ఆలయం వద్ద అగనంపూడి కాపు సేవా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపులు అత్యధికంగా ఉన్న గాజువాకలో మరింత ప్రాధాన్యం కల్పించాలన్నారు. జిల్లాలోని కాపులను ఒకేతాటిపైకి తీసుకువచ్చేందుకు వచ్చేనెల 24వ తేదీన కాపు వన సమారాధన ఏర్పాటు చేశామని, జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్ర ధాన కార్యదర్శి తలారి వెంకటరమణ, ముమ్మన అప్పారావు, కటారి శ్రీనివాసరావు, గంతకోరు అప్పారావు, దుల్లా చెల్లారావు, ఈ.హనుమంతరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం

సీతమ్మధార : ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందామని చిట్టివలస లేబర్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహారదీక్ష 946వ శిబిరానికి హాజరై ఆయన మాట్లాడారు. నగరంలోని అఖిలపక్ష కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, మేధావులు అందరూ ఒక తాటిపైకి వచ్చి పోరాడుతున్నారన్నారు. లాభాల్లో నడుస్తున్న ప్లాంట్‌ను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉన్న ఉద్యోగాలు పోవడంతో పాటు ముందు తరాలకు ఉపాధి ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ అమ్మకానికి పెట్టి దేశాన్ని దివాళా తీయిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, నూలు ఆదినారాయణ, చిల్లరాం, వై.కొండయ్య, సూరప్పుడు తదితరులు పాల్గొన్నారు.


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న నాయకులు

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ ఈస్ట్
9912220751, 9010055116
Office mail : sakshiadvtvsp@gmail.com